క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతులు జరుగుతున్నందున శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు శాంతినగర్, ప్రశాంతినగర్, కండ్రిక మెయిన్ రోడ్డు, ప్రకాష్‌నగర్, పాయకాపురం, డాక్టర్స్ కాలనీ, రాధానగర్, బర్మాకాలనీ, ఓల్డ్ రాజీవ్ నగర్, న్యూరాజీవ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

కన్యకాపరమేశ్వరి అమ్మవారికి సారె



మధురానగర్(విజయవాడసెంట్రల్):32వ డివిజన్ అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్‌కు చెందిన మహిళలు శుక్రవారం అన్నసంతర్పణ సమితి ఆధ్వర్యాన సత్యనారాయణపురంలో నూతనంగా ప్రతిష్ఠించబడిన వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి సారె సమర్పించారు. పెద్ద సంఖ్యలో మహిళలు మేళతాళాలతో లోటస్ ల్యాండ్ మార్క్ వద్ద నుంచి ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారికి చీర పండ్లు, పువ్వులు, పసుపు, కుంకుమ, గాజులు ఇతర పూజ సామగ్రిని సారెగా సమర్పించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు గుండు దిలీప్ రమణి, కార్యదర్శి పిఎస్ఆర్ మూర్తి, కొల్లూరు రామకృష్ణ, దేవకి శివ సురేంద్ర బాబు, సభ్యులు గార్లపాటి కరుణాకర్‌శాంతి, ఆలపాటి సుందరరావు, ముచ్చర్ల శ్రీనివాస్, శోభన చలపతి గుప్తా, తొండెపు ప్రసాద్‌రాధా తదితరులు పాల్గొన్నారు.

విద్యావేత్త త్యాగరాజు సహాయంకు నివాళి



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సెయింట్ జాన్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్లో సంస్థ వ్యవస్థాపకలు త్యాగరాజు సహాయం జయంతి శుక్రవారం నిర్వహించారు. ఎస్ఆర్‌ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ డాక్టర్ డి.కైలాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా త్యాగరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగరాజు సహాయం మంచి విద్యావేత్త అని కొనియాడారు. మొట్టమొదటిగా నగరంలో విద్యావ్యాప్తికి విద్యా సంస్థను స్థాపించి ఎంతో మంది విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలబెట్టడంలో ఆయన చేసిన కృషి ఎనలేనిదని తెలిపారు. విద్యార్థుల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సంస్థ చైర్మన్ మోనికా సుమన్, కరస్పాండెంట్ సుమన్ త్యాగరాజ్, ప్రిన్సిపాల్ లక్ష్మీ కౌలస్య తదితరులు పాల్గొన్నారు.

మధురంగా దేశ భక్తి గీతాలు



విజయవాడ కల్చరల్: సురభి కళావేదిక ఆధ్వర్యంలో తొలి కార్యక్రమంగా గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికమీద శుక్రవారం నిర్వహించిన మహా గాయకుల గీతాల కార్యక్రమం మధురంగా సాగింది. సీనియర్ గాయకుడు దండు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తెలుగు, హిందీ చిత్రగీతాలను వడ్డాది సూర్య కామేశ్వరి, ఎం.కృష్ణకుమారి, రూపా సత్యశ్రీ, ఎం. మీనాకుమారి, ఎం.శ్యాంప్రసాద్ భక్తి గీతాలు, దేశ భక్తి గీతాలు, లలిత గీతాలతో పాటు క్లాసికల్ గీతాలను ఆలపించారు. సంస్థ వ్యవస్థాపకుడు కామినేని ఉమాశంకర్ మాట్లాడుతూ మధుర గాయనీ గాయకుల సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సంస్థ ద్వారా నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పిస్తున్నట్లు వివరించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ ప్రతిభను గుర్తించి వేదిక కల్పించాలన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన రావి బేబి సత్యవాణి ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై శుక్రవారం సాయంత్రం నృత్య ప్రదర్శన జరిగింది. అనంతరం అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందచేశారు.

జగనన్న సురక్షతో విప్లవాత్మక మార్పులు

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



శిబిరంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్):జగనన్న సురక్ష ద్వారా పాలనలో విప్లవాత్మకమైన మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం నాంది పలికిందని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 30వ డివిజన్ దేవీనగర్‌లో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో స్థానిక కార్పొరేటర్ జానారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం సెంట్రల్ నియోజకవర్గమంతటా పండుగ వాతావరణంలో జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన వారు మిగిలిపోకూడదన్నదే కార్యక్రమ ప్రధాన లక్ష్యమన్నారు. వారం రోజుల పాటు సర్వే ద్వారా ఇంటింటా జల్లెడపడుతూ అర్హులను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అవసరమయ్యే ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల నుంచి తీసుకునే 11 రకాల సర్టిఫికెట్లు ఎటువంటి సర్వీసు ఛార్జీలు లేకుండా అందజేస్తున్నట్లు తెలిపారు. క్యాంపు ద్వారా డివిజన్‌లో 678 మందికి కుల, 829 మందికి ఆదాయ పత్రాలతో పాటు వివిధ రకాల సేవల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు 1,508 పత్రాలను ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలు, సేవలతో సంతృప్తి చెందిన లబ్ధిదారులు.. ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తూ 9052690526 నెంబర్‌కి ఎస్ఎంఎస్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఓయూసీడీ శకుంతల, ఆర్ఐ (రెవెన్యూ) ప్రసాద్, అన్ని శాఖల అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

61వ డివిజన్లో జగనన్న సురక్ష సర్వే

పాయకాపురం(విజయవాడరూరల్): 61వ డివిజన్లో శుక్రవారం జగనన్న సురక్ష సర్వే నిర్వహించారు. సంక్షేమ పథకాలకు అర్హత కల్గి ఉండి ఇంకా ఎవరికైనా రాని వారి వివరాలు నమోదు చేశారు. అందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఈ నెల 21వ తేదీన జగనన్న సురక్ష శిబిరంలో అందిస్తామన్నారు. 11 రకాల సేవల గురించి వివరించారు.



జగనన్న సురక్ష సర్వే చేస్తున్న వలంటీరు షబన

256, 257, 261, 262 సచివాలయాల పరిధిలోని సుమారు 80 మంది వలంటీర్లు సర్వేలో పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్):నవరత్నాలతో ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు ప్రసరింపచేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 59 వ డివిజన్ 254వ వార్డు సచివాలయ పరిధిలో శుక్రవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ ఎండి షాహినా సుల్తానాతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించటంతో పాటు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సంతకం చేసిన బుక్ లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలపై ప్రజలతో చర్చించి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

సచివాలయ పరిధిలో రూ. 5.76 కోట్ల సంక్షేమం...

నాలుగేళ్లలో వార్డు సచివాలయ పరిధిలో అక్షరాలా రూ.5 కోట్ల 76 లక్షల 22 వేల 359 సంక్షేమాన్ని పేదలకు అందజేసినట్లు వెల్లడించారు. అలాగే పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ 366 మందికి సచివాలయ పరిధిలో ఇళ్ల పట్టాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. జీవో నెం. 60 ద్వారా నగర ప్రజలకు 100 గజాల లోపు ఇళ్లకు ఉచిత రిజిస్ట్రేషన్లు చేస్తున్నామని వెల్లడించారు. జీవో నంబర్లు 225, 36 ద్వారా అభ్యంతరం లేని ఆక్రమిత భూముల్లో 150 గజాల లోపు అందరికీ రెగ్యులరైజ్ చేయనున్నట్లు వివరించారు.

ఒంటరిగా ఎదుర్కొనే శక్తి ప్రతిపక్షాలకు లేదు....

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదుర్కొనే సత్తా లేక పొత్తుల కోసం వెంపర్లాడే నేతలు కూడా ముఖ్యమంత్రి గురించి విమర్శలు చేయడం హాస్యాస్పదమని అన్నారు. ప్రతిపక్ష పార్టీలకు పొత్తులపై ఉన్న శ్రద్ధ.. ప్రజలపై ఏమాత్రం లేదని తెలిపారు. 2014లో ముగ్గురు కలిసి పోటీచేస్తే స్వల్ప తేడాతో ఆనాడు చంద్రబాబు గెలిచారని తెలిపారు. అదే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒంటరిగా పోటీ చేసి 151 సీట్లతో చరిత్ర సృష్టించారని చెప్పారు. అధికారంలో ఉండగా టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరి చేశాయని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాతనే పాలన మరలా గాడిన పడిందన్నారు. 2024లోనూ ఈ పార్టీలకు మరోసారి గట్టిగా బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎంఓహెచ్ డాక్టర్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి, నాయకులు హఫీజుల్లా, అన్ని శాఖల అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● బెజవాడలో మోడల్ స్ట్రీట్‌లైట్స్ !

మహాత్మాగాంధీరోడ్డులో రాఘవయ్యపార్కు నుంచి బెంజ్‌సర్కిల్ వరకు డివైడర్ మధ్యలో ఆకర్షణీయమైన బటర్‌ఫ్లై మోడల్ స్ట్రీట్ లైట్లు నగర పాలక సంస్థ ఏర్పాటు చేస్తోంది. రూ.80 లక్షల వ్యయంతో ఈ దీపాలను నెలకొల్పుతున్నారు. మధ్యలో ఉన్న సిమెంట్ స్తంభాలను తీసివేసి ఐరన్ పోల్స్ పెడుతున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





వ్యక్తిత్వ వికాసంతో ఉన్నత స్థానం



సదస్సులో మాట్లాడుతున్న సైకాలజిస్టు కళ్యాణి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఏ రంగంలోనైనా ఉన్నత స్థానాలకు చేరాలంటే వ్యక్తిత్వ వికాసం ఆవశ్యకత ఎంతో ఉందని మానసిక నిపుణురాలు దేవిరెడ్డి కళ్యాణి అన్నారు. నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో ఫార్మస్యూటిక్స్, బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జీవితంలో ఉన్నత స్థాయికి చేర్చే విధానాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సైకాలజిస్టు కళ్యాణి మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థానాలు సాధించిన వారి అలవాట్లు, ఆలోచన విధానం తెలియచేస్తూ, విద్యార్థి దశ నుంచే ఉన్నత స్థాయికి చేరాలంటే జీవన విధానాన్ని ఎలా మెరుగుపరుచుకోవాలో వివరించారు. విద్యార్థులకు గొప్ప వ్యక్తుల జీవిత సారాంశాలను వివరించి, వారెలా గొప్ప వ్యక్తులు కావాలో ఉత్తేజపరిచేలా ప్రసంగించారు. ప్రిన్సిపాల్ ఎ.సునీత, ఫార్మస్యూటిక్స్ , బయోటెక్నాలజీ హెచ్ఓడీ డాక్టర్ జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

కొమ్మకత్తిరింపు చర్యలు చేపట్టాలి

మామిడి రైతులకు శాస్త్రవేత్త కనకమహాలక్ష్మి సూచన



నున్న(విజయవాడరూరల్): మామిడి సీజన్ పూర్తి అయిన పిమ్మట మామిడి రైతులు మామిడిచెట్ల కొమ్మ కత్తిరింపునకు చర్యలు చేపట్టాలని మామిడి పరిశోధన కేంద్రం ప్రిన్సిపాల్, శాస్త్రవేత్త బి.కనక మహాలక్ష్మి అన్నారు. శుక్రవారం నున్న గ్రామంలో రైతుభరోసా కేంద్రంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మామిడి తోటల్లో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులపై కనకమహాలక్ష్మి మాట్లాడుతూ మామిడి చెట్లలో దట్టంగా పెరిగిన కొమ్మలను కత్తిరించాలన్నారు. చెట్లకు గాలి, వెలుతురు వచ్చే విధంగా చూసి కొమ్మలను కత్తిరించినట్టయితే సూర్యరశ్మి చెట్లకు, వేరులకు చేరుతుందన్నారు. ఎండుకొమ్మలను పూర్తిగా తొలగించాలని రైతులకు సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ కె.సువర్ణరాజు, ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, గ్రామ సొసైటీ చైర్మన్ పోలారెడ్డి చంద్రారెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి బాలాజీకుమార్, విజయవాడ ఉద్యానశాఖ అధికారి పరమేశ్వరరెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

3డి ప్రింటింగ్ టెక్నాలజీతో కాంక్రీట్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ సివిల్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఏపీలో ప్రప్రథమంగా నెలకొల్పిన 3డి ప్రింటింగ్ టెక్నాలజీతో కాంక్రీట్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న కేసీపీ వైస్ ప్రెసిడెంట్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ 3డి ప్రింటింగ్ టెక్నాలజీతో కాంక్రీట్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో నిర్మాణ రంగంలో సాంకేతిక అభివృద్ధి సాధించగలుగుతామన్నారు.

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అధునాతన ప్రయోగశాలలు, ప్రత్యేక సాఫ్ట్‌వేర్, కాంక్రీట్ టెక్నాలజీలో పరిశోధనలతో సివిల్ ఇంజినీరింగ్ రంగంలో పెను మార్పులు తీసుకు రావచ్చన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో మొదటిసారిగా తమ కాలేజీలో 3డి ప్రింటింగ్ టెక్నాలజీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేశామన్నారు. సివిల్ ఇంజినీరింగ్ చదువున్న విద్యార్థులు ఆచరణాత్మకమైన నైపుణ్యం, పరిశ్రమలకు అవసరమైన టెక్నాలజీ పెంపొందించుకోవటానికి ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కాలేజీ కన్వీనర్ మలినేని రాజయ్య, డీన్ పాండురంగారావు, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి చావా శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జిల్లా సైన్స్ అధికారులకు శిక్షణ



పూణే ల్యాబ్ శిక్షణలో ఎం.హుస్సేన్

పాయకాపురం(విజయవాడరూరల్): ఎస్టీఆర్టీ, సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో యూనిసెఫ్ సహకారంతో విజ్ఞాన ఆశ్రమం వారు నాలుగు రోజుల పాటు పూణేలో సైన్సు ఉపాధ్యాయులకు ఏటీఎల్ ల్యాబ్స్–పరిశోధనపై శిక్షణ నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి పుచ్చలపల్లి సుందరయ్య వీఎంసీ హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడు ఎం.హుస్సేన్ పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమాల వివరాలను శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజ్ఞాన ఆశ్రమం వారు నిర్వహించిన ప్రయోగాలు, పరిశోధనలు ఉపాధ్యాయుల పనితీరును మెరుగుపర్చుకోవడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి దోహదం చేశాయని తెలిపారు. ముఖ్యంగా 3డి ల్యాబ్స్ పనితీరు, ఎలక్ట్రానిక్స్, రోబోటిక్ టెక్నాలజీ, సెన్సార్ల పనితీరుపై అవగాహన పొందామని పేర్కొన్నారు. లెండిఏ ల్యాండ్ ఇండియా అనే ల్యాబ్స్‌ను సందర్శించి అక్కడ చేస్తున్న పరిశోధనలు గమనించారు. ఐసర్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ సంస్థలోని అనేక ల్యాబ్స్‌ను సందర్శించారు. రాబోవు రోజుల్లో నాణ్యమైన విద్యను బోధించేందుకు శిక్షణ ఉపయోగపడుతుందన్నారు.

అన్నపూర్ణాదేవికి సారె సమర్పణ



ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):ఎక్కడైతే దేవాతామూర్తులు పూజింపబడతారో ఆ ప్రాంతమంతా దైవానుగ్రహంతో విరాజిల్లుతుందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. స్థానిక సత్యనారాయణపురంలోని శ్రీకాశి విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానంలో కొలువైయున్న అన్నపూర్ణదేవికి పాలకమండలి సభ్యులు మంగళంపల్లి నాగేశ్వరరావు, లావణ్య దంపతులచే శుక్రవారం అమ్మవారికి సారె సమర్పణ కార్యక్రమం కనులపండువగా జరిగింది. పెద్ద సంఖ్యలో మహిళలు మేళతాళాలతో పురవీధుల గుండా ఊరేగింపుగా సారెను దేవస్థానానికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయ ఉంటే అన్నీ ఉన్నట్టేనని చెప్పారు. మహిళలు పెద్ద ఎత్తున సారె తీసుకురావటం ఎంతో దైవకార్యం అన్నారు. మహిళలకు దేవస్థానం కార్యనిర్వాహణాధికారిణి కె.సుపద్మాదేవి స్వాగతించి అమ్మవారికి సారె సమర్పించారు. దేవస్థానం చైర్మన్ కొల్లూరు రామకృష్ణ, 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి, బూరుల రాధిక పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎం స్కూల్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు



జెర్సీలను ఆవిష్కరిస్తున్న ఎన్ఎస్ఎం స్కూల్ ప్రిన్సిపాల్, పూర్వ విద్యార్థులు

విజయవాడ స్పోర్ట్స్: పటమటలోని ఎన్ఎస్ఎం స్కూల్ స్థాపించి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ రెవరెండ్ బ్రదర్ రాయపురెడ్డి అన్నారు. స్కూల్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1974లో స్కూల్‌ను పటమటలో ప్రారంభించామన్నారు. ఇప్పటి వరకు 8 వేల మంది పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. పాఠశాల తొలి విద్యార్థి, గోల్డెన్ జూబ్లీ వేడుకల ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ ఎస్.జగదీష్ మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని చెప్పారు. దీనిలో భాగంగానే ఈ నెల 16వ తేదీ ఆదివారం భారీ రన్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం 6.30 గంటలకు ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియం నుంచి రన్ ప్రారంభమై పాఠశాల వరకు చేరుకుంటుందన్నారు. 2 వేల మంది పూర్వ విద్యార్థులు ఈ రన్‌లో పాల్గొంటారని వెల్లడించారు. పాఠశాల పూర్వ విద్యార్థి ఎం.కృష్ణకిరణ్ మాట్లాడుతూ గోల్డెన్ రన్‌ను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ప్రారంభిస్తారన్నారు. గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ఆగస్టు ఆరో తేదీన మెడికల్ క్యాంప్, సెప్టెంబర్ ఐదో తేదీన పాఠశాలల పూర్వ, ప్రస్తుత ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బందిని సన్మానించడం, అక్టోబర్ ఎనిమిదో తేదీన పూర్వ విద్యార్థులకు క్రీడా పోటీలు, నవంబర్ ఐదో తేదీన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. డిసెంబర్ 21, 22 తేదీల్లో జరిగే ప్రత్యేక కార్యక్రమాలతో ఈ వేడుకలు ముగుస్తాయన్నారు. అనంతరం గోల్డెన్ రన్‌కు సంబంధించిన జెర్సీలను ఆవిష్కరించారు. సమావేశంలో స్కూల్ కరస్పాండెంట్ బాలారెడ్డి, కో–ఆర్డినేటర్ భ్రమరకుమారి పూర్వ విద్యార్థులు జయనారాయణ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు



వాహనాలు దొంగిలించిన నిందితుడు శ్రీనివాస్‌తో డీఎస్పీ తదితరులు

బంటుమిల్లి(పెడన): ఉమ్మడి కృష్ణాజిల్లాలో 27 ద్విచక్ర వాహనాలను దొంగిలించి, వాటిని బంటుమిల్లి ప్రాంతంలో మారుబేరానికి అమ్మించిన ఘరానా దొంగను బంటుమిల్లి పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మచిలీపట్నం డీఎస్పీ వై.మాధవరెడ్డి వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం పోలీసులు ఇటీవల 216 జాతీయ రహదారిపై పోలీసుల తనిఖీల్లో ధ్రువపత్రాలు లేని వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకోగా అవి దొంగతనంగా తెచ్చి అమ్మిన విషయం వెలుగు చూసింది. ఎస్ఐ పైడిబాబు పర్యవేక్షణలో పోలీసులు విచారించగా పెద్ద కుంభకోణం వెలుగులోకి వచ్చింది. కృత్తివెన్ను మండలం చినపాండ్రాక గ్రామానికి చెందిన పడవల కరుణకుమార్‌కు విజయవాడ గుణదలలో నివాసం ఉండే అవనిగడ్డ మండలం వేకనూరు గ్రామానికి చెందిన తుంగల శ్రీనివాస్‌కు మచిలీపట్నం సబ్ జైలులో పరిచయం ఏర్పడింది. అప్పటికే శ్రీనివాస్‌పై జిల్లాలోని పలు స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయి. కరుణకుమార్ చినపాండ్రాక గ్రామానికి చెందిన మోటార్‌సైకిల్ మెకానిక్‌లు పుప్పాల సురేష్, ముత్యాల అశోక్‌కుమార్, పుప్పాల హరీష్‌ల సాయంతో శ్రీనివాస్ దొంగిలించిన ద్విచక్రవాహనాలను అమ్మడం మొదలు పెట్టి, ఆ విధంగా 9 ద్విచక్రవాహనాలను అమ్మాడు. మిగిలిన వాహనాలను శ్రీనివాస్ గుర్తు తెలియని ప్రాంతంలో దాచాడు. దొంగిలించిన మోటారు సైకిళ్లకు ఇంజన్, చాయిస్ నంబర్లను మారుస్తూ నంబరు ప్లేట్లు మార్చి బంటుమిల్లి, కృత్తివెన్ను ప్రాంతాల్లో అమ్మారు. నంబరు ప్లేట్లు, ధ్రువ పత్రాలు లేకుండా తిరుగుతున్న వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో ఈ భారీ కుంభకోణం బయటపడింది. దీని ఆధారంగా వారి వద్ద నుంచి 27 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ చెప్పారు. వీటిని కోర్టులో ప్రవేశపెడతామని సరైన ధ్రువపత్రాలు ఇచ్చి కోర్టు నుంచి యజమానులు తమ వాహనాలను తీసుకోవచ్చని డీఎస్పీ తెలిపారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాల్లో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లోని పలు ప్రాంతాలకు చెందినవి ఉన్నాయన్నారు. దాదాపు రూ.15 లక్షల విలువ చేసే వాహనాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితులు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. చాకచక్యంతో సమాచారం సేకరించి పెద్ద ఎత్తున దొంగ వాహనాలను స్వాధీనం చేసుకోవడంలో కృషి చేసిన ఎస్ఐ పైడిబాబు, ఏఎస్ఐ ప్రసాదు, కానిస్టేబుళ్లు హరిబాబు, యూనస్, జనార్ధన్, హోంగార్డు వెంకన్నలను జిల్లా ఎస్పీ జాషువా అభినందించి రివార్డులు ప్రకటించారు.

వాహన యజమానులూ జాగ్రత్త!

ద్విచక్రవాహన యజమానులు ఇళ్ల వద్ద గాని, వ్యాపార సంస్థల వద్ద గాని ఇతర స్థలాల్లో గాని తమ వాహనాలను నిలిపే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ వై.మాధవరెడ్డి అన్నారు. అదేవిధంగా పాత వాహనాలను కొనే ముందు అన్ని పత్రాలు పరిశీలించి కొనాలని సూచించారు. సమావేశంలో పెడన సీఐ ప్రసన్నవీరయ్యగౌడ్, ఎస్ఐ పైడిబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేకాటాడుతున్న ఏడుగురు అరెస్ట్

రూ.82,560 నగదు స్వాధీనం

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ):ఇంట్లో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై కొత్తపేట పోలీసులు గురువారం అర్ధరాత్రి దాడి చేశారు. ఈ దాడిలో పేకాటాడుతున్న ఏడుగురిని అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి రూ. 82,560 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.